**122వ అధ్యాయం**

# ١٢٢ - بَابُ تَحْرِيمِ لِبَاسِ الْحَرِيرِ عَلَى الرِّجَالِ وَتَحْرِيمِ جُلُوسِهِمْ عَلَيْهِ وَاسْتِنَادِهِمْ إِلَيْهِ وَجَوَازِ لُبْسِهِ لِلنِّسَاءِ

# పట్టువస్త్రాలు ధరించటం పురుషులకు నిషిద్ధం, వాటి మీద కూర్చోవటం, దిండుగా చేసుకోవటం కూడా నిషిద్ధం, అయితే పట్టు వస్త్రాలు ధరించటం స్త్రీలకు సమ్మతమే

٨٠٤ - عن عمرَ بنِ الخطَّابِ رضيَ اللهُ عنه قال: قالَ رسُولُ اللهِ ﷺ: «لَا تَلْبَسُوا الحَرِيرَ؛ فَإِنَّ مَنْ لَبِسَهُ فِي الدُّنْيَا لَمْ يَلْبَسْهُ فِي الآخِرَةِ» متفقٌ عليه.

804. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : పట్టు వస్త్రాలు ధరించకండి. వాటిని ఇహలోకంలో ధరించిన వారు పరలోకంలో ధరించలేరు.

*(బుఖారీ - ముస్లిం)*

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని వస్త్రధారణ ప్రకరణాలు)*

## ముఖ్యాంశాలు

పై హదీసులోని వారింపు ముస్లిం పురుషులకు మాత్రమే. స్త్రీలు పట్టువస్త్రాలు ధరించవచ్చు. పురుషులు పట్టువస్త్రాలు ధరించకూడదనటానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. పట్టువస్త్రాలు కేవలం అలంకారప్రాయమైనవి. అది స్త్రీల ప్రత్యేక లక్షణం. అదీగాక పట్టువస్త్రాలు పురుషుల్లో సహజంగా ఉండే ధైర్యం, సాహసం, మొరటుతనం లాంటి పురుషలక్షణాలను ప్రభావితం చేయటమే గాకుండా వారిలో సౌకుమార్యాన్ని పెంపొందింపజేస్తాయి. పట్టువస్త్రాలు ధరించేవారిలో సహజంగానే గర్వం పుడుతుంది. ఇస్లాం దాన్ని సుతరామూ సహించదు. పురుషులకు పట్టు వస్త్రాలు అనుమతించకపోవటానికి ఇంకో ముఖ్య కారణం ఏమిటంటే, ఈ వస్త్రధారణ ఇస్లాం ధర్మం మానవునిలో తీసుకురాదలచిన నిరాడంబరతకు విరుద్ధం. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : నిరాడంబరత ఇస్లాంలో అంతర్భాగం (ఇమామ్ అహ్మద్, ఇబ్నె మాజా, హాకిమ్ తదితరులు ఈ హదీసును వెలికితీశారు). పై కారణాల వల్ల పురుషులు పట్టువస్త్రాలు ధరించటానికి అనుమతించబడలేదు.

٨٠٥ ـ وعنه قال: سَمِعْتُ رسُولَ اللهِ ﷺ يقولُ: «إنَّمَا يَلْبَسُ الحَرِيرَ مَنْ لَا خَلَاقَ لَهُ» متفقٌ عليه. وفي روايةٍ لِلبُخاري: «مَنْ لَا خَلَاقَ لَهُ فِي الآخِرَةِ». قولُه: «مَنْ لَا خَلَاقَ لَهُ»، أَيْ: لَا نَصِيبَ لَهُ.

805. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) గారే చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ఎలాంటి (ప్రతిఫల) భాగ్యానికి నోచుకోనివాడే పట్టువస్త్రాలు ధరిస్తాడు.

*(బుఖారీ - ముస్లిం)*

బుఖారీలోని వేరొక ఉల్లేఖనంలో “పర లోకంలో ఎలాంటి (ప్రతిఫల) భాగ్యానికి నోచుకోనివాడు” అని ఉంది.

*(సహీహ్ బుఖారీ - సహీహ్ ముస్లింలలోని వస్త్రధారణల ప్రకరణం)*

٨٠٦ ـ وعن أنسٍ رضيَ اللهُ عنه قال: قالَ رسُولُ اللهِ ﷺ: «مَنْ لَبِسَ الحَرِيرَ فِي الدُّنْيَا لَمْ يَلْبَسْهُ فِي الآخِرَةِ» متفقٌ عليه.

806. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : ఇహలోకంలో పట్టుబట్టలు ధరించినవాడు పరలోకంలో వాటిని ధరించలేడు. *(బుఖారీ - ముస్లిం)*

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని వస్త్రధారణ ప్రకరణం)*

٨٠٧ ـ وعن عليٍّ رضيَ اللهُ عنه قال: رَأَيْتُ رسُولَ اللهِ ﷺ أَخَذَ حَرِيراً، فَجَعَلَهُ فِي يَمِينِهِ، وَذَهَباً فَجَعَلَهُ فِي شِمَالِهِ، ثُمَّ قال: «إنَّ هٰذَيْنِ حَرَامٌ عَلَى ذُكُورِ أُمَّتِي». رواهُ أبو داود بإسنادٍ حسن.

807. హజ్రత్ అలీ (రజి) కథనం : ఒకసారి దైవప్రవక్త (సల్లం) పట్టు (వస్త్రాన్ని) పట్టుకుంటుండగా నేను చూశాను. ఆయన దాన్ని కుడిచేతిలోకి తీసుకున్నారు. ఆ తర్వాత బంగారాన్ని ఎడమచేతిలోకి తీసుకొని ఇలా అన్నారు: ఈ రెండూ నా అనుచర సమాజంలోని పురుషులకొరకు నిషేధించబడినవి. (అబూదావూద్ దీనిని ప్రామాణికమైన ఆధారాలతో ఉల్లేఖించారు).

*(సుననె అబూ దావూద్‌లోని వస్త్రధారణ ప్రకరణం)*

808. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : పట్టు వస్త్రాలు, బంగారం నా అనుచర సమాజంలోని పురుషులకు నిషేధించబడ్డాయి. స్త్రీలకు సమ్మతించబడ్డాయి. (తిర్మిజీ - హసన్, సహీహ్)

٨٠٨ - وعن أبي مُوسى الأشعَريّ رضيَ اللهُ عنه أنَّ رسُولَ اللهِ ﷺ قال: «حُرِّمَ لِبَاسُ الحَرِيرِ وَالذَّهَبِ عَلَى ذُكُورِ أُمَّتِي، وَأُحِلَّ لِإِنَاثِهِمْ». رواهُ الترمذي وقال: حديثٌ حسن صحيحٌ.

*(సునసె తిర్మిజీలోని వస్త్రధారణ ప్రకరణం)*

809. హజ్రత్ హుజైఫా (రజి) కథనం : బంగారు, వెండి పాత్రల్లో త్రాగకూడదనీ, తినకూడదనీ, పట్టువస్త్రాలు ధరించ కూడదనీ, వాటిమీద కూర్చోకూడదనీ దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని వారించారు. *(బుఖారీ)*

٨٠٩ - وعن حُذَيفَةَ رَضيَ اللهُ عنه قال: نَهَانَا النَّبيُّ ﷺ أنْ نَشْرَبَ في آنِيَةِ الذَّهَبِ وَالفِضَّةِ وَأنْ نَأكُلَ فِيهَا، وعَنْ لُبْسِ الحَرِيرِ وَالدِّيبَاجِ، وَأَنْ نَجلِسَ عَلَيْهِ. رواهُ البخاري.

*(సహీహ్ బుఖారీలోని వస్త్రధారణ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

పట్టు వస్త్రాల్లో అనేక రకాలున్నై. పల్చటి పట్టువస్త్రాల్ని 'ఇస్త్రబ్రక్' అని అంటారు. ముతక పట్టువస్త్రాల్ని 'దీబాజ్' అంటారు. అసలు పట్టు వస్త్రాలంటే సహజంగా పట్టుపురుగుల నుండి తయారుచేయబడినవే. కాని ఈ రోజుల్లో పట్టులాంటి వస్త్రాలు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. చూడటానికి అవి కూడా పట్టువస్త్రాల మాదిరిగానే కనిపిస్తాయి కాని వాస్తవానికి అవి పట్టువి అయివుండవు. అలాంటి కృత్రిమ వస్త్రాలు ధరించటం పురుషులకు నిషిద్ధం కాదు. కాని ఏదయినా ప్రాంతంలో ప్రత్యేకంగా స్త్రీలే అలాంటి బట్టలు ధరిస్తున్నట్లయితే ఆ ప్రాంతంలో పురుషులు కృత్రిమ వస్త్రాలు కూడా ధరించకుండా ఉండటం మంచిది.

అదేవిధంగా పట్టువస్త్రాల మీద కూర్చోవద్దని కూడా దైవప్రవక్త (సల్లం) వారించారు. అంచేత పట్టువస్త్రాలను దుప్పట్లుగా వాడటం, పరుపులకు, దిండ్లకు ఉపయోగించటం కూడా ధర్మసమ్మతం కాదు.